



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఇక 'ప్రీ ప్రైమరీ'



అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త విద్యా విధానం



గిర్నితండాలో ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రం

- రేపటి నుంచి 20 వరకు అమ్మమాట-అంగన్‌వాడీ బాట
- జిల్లాలో 713 అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక
- రెండున్నరేళ్లు పైబడిన పిల్లలను చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్

మహబూబాబాద్ టౌన్, జూలై 13: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు ఇక ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ (పూర్వ ప్రాథమిక విద్య)ను అందించనున్నాయి. రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్ల పిల్లల వరకు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణను కూడా ఇచ్చారు. రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చేర్పించేందుకు గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట తరహాలోనే ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' పేరిట తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో ఇద్దరు సూపర్‌వైజర్లను ఎంపిక చేసి వారికి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారు మాస్టర్ల ట్రైనర్లుగా వ్యవహరించి అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్‌పై పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం సిలబస్‌ను కూడా సిద్ధం చేసి పిల్లలకు కిట్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో 713 పాఠశాలలు ఎంపిక

మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు గూడూరు, మరిపెడ, మానుకోట, డోర్నకల్, తొర్రూరు పరిధిలో 1,437 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో తొలి విడతలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న 713 కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్య కోసం ఎంపిక చేశారు. అందులో 559 కేంద్రాలకు పాఠశాల ఆవరణలో గదులు కేటాయించగా, 154 కేంద్రాలకు మాత్రం సొంత భవనాలున్నాయి. రెండున్నర ఏళ్ల నిండిన చిన్నారులను చేర్పించి విద్యను అందించనున్నారు. ప్రాథమిక పాఠశాలలో చేరే నాటికి అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ టీచర్లందరికి ప్రీ ప్రైమరీ విద్యపై శిక్షణను పూర్తిచేశారు.

20 వరకు అమ్మబాట-అంగన్‌వాడీ బాట

రెండున్నర ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాలలో చేర్పించేందుకు ఈనెల 15 నుంచి 20 వరకు గ్రామాల్లో అమ్మబాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఒక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లల నమోదు చేసేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు.

- 15, 16న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, యువత, ఎన్జీవోస్, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు కోసం గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తారు.
- 18న రెండున్నర సంవత్సరాల పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు కల్పించడం. ప్రీ ప్రైమరీ పాఠశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్ అందించి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తారు.
- 19న అంగన్‌వాడీ కేంద్రాల్లో తరగతి గదులను శుభ్రం చేసి ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి మొక్కలు నాటనున్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతారు. పిల్లలకు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రీ స్కూల్ సిలబస్‌ను ప్రదర్శిస్తారు.
- 20న ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ డే(ఈసీసీఈ), సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహిస్తారు. ప్రీ స్కూల్ ప్రాధాన్యతను తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. ప్రీ స్కూల్ మెటీరియల్ ప్రదర్శించనున్నారు. దీంతో ఆరు రోజుల పాటు నిర్వహించిన అమ్మమాట-అంగన్‌వాడీ బాట ముగుస్తోంది.

మండలాల వారీగా ప్రీ స్కూల్ ఎంపికలిలా..

జిల్లాలో 713 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్‌కు ఎంపిక చేయగా అందులో మండలాల వారీగా ఇలా ఉన్నాయి. డోర్నకల్ ప్రాజెక్టు పరిధిలోని డోర్నకల్ మండలంలో 22, గార్లలో 39, కురవిలో 59, గూడూరు ప్రాజెక్టు పరిధిలోని గంగారం మండలంలో 17, గూడూరులో 78, కొత్తగూడలో 50, మరిపెడ ప్రాజెక్టు పరిధిలో చిన్నగూడూరులో 17, దంతాలపల్లిలో 30, మరిపెడలో 72, నర్సింహులపేటలో 45, మహబూబాబాద్ ప్రాజెక్టు పరిధిలోని బయ్యారంలో 55, కేసముద్రంలో 64, మహబూబాబాద్‌లో 79, తొర్రూరు ప్రాజెక్టు పరిధిలోని నెల్లికుదురులో 36, పెద్దవంగరలో 19, తొర్రూరులో 31 కేంద్రాలున్నాయి.

"రెండున్నరేళ్ల పిల్లలను ప్రీ స్కూల్‌లో చేర్పించాలి

వరలక్ష్మి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి



రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ కోసం ఎంపిక చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. ప్రాథమిక పాఠశాలలో చేరేలోపు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను ప్రీ ప్రైమరీ స్కూల్‌లో నేర్పుతారు. అందుకోసం జిల్లాలో 713 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 15 నుంచి 20 వరకు అమ్మమాట అంగన్‌వాడీ బాట పేరిట ప్రతిరోజు కార్యక్రమాలు నిర్వహించి ప్రీ స్కూల్‌పై అవగాహన కల్పించనున్నాం."

పేదల సంక్షేమానికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు, జూలై 13 : పాలకుర్తి నియోజకవర్గంలో పేద ప్రజల సంక్షేమం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతుందని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఆరు మండలాల్లోని గ్రామాల్లో అనారోగ్యానికి గురైన 185 మందికి సుమారు రూ.49 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ పేదవాడికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుందని, కాంగ్రెస్ హయాంలో అర్హులైన పేదవారందరికీ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు హమ్యానాయక్, సోమ రాజశేఖర్, సంతోష్, పెదగాని సోమయ్య, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో 153.8 మి.మీ వర్షపాతం

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 13 : జిల్లాలో శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. మరిపెడ, నెల్లికుదురు, డోర్నకల్, గార్ల, చిన్నగూడూరులలో భారీ వర్షం పడింది. మిగతా మండలాల్లో జల్లులు కురిసాయి. కొత్తగూడలో 5.6, గంగారంలో 3.4, బయ్యారంలో 0.6, గంగారంలో 3.4, గార్లలో 12.6, డోర్నకల్‌లో 15.2, కురవిలో 0.9, మహబూబాబాద్‌లో 1.8, కేసముద్రంలో 4.4, నెల్లికుదురులో 22.2, నర్సింహులపేటలో 4.0, చిన్నగూడూరులో 11.4, మరిపెడలో 46.2, దంతాలపల్లిలో 3.6, తొర్రూరులో 6.2, పెద్దవంగరలో 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెరసి 153.8 మిల్లీమీటర్ల వర్షం పడగా జిల్లా సగటున 9.6 వర్షపాతం నమోదైంది.

ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ మేళా

- నేటి నుంచి హరిపిరాలలో నిర్వహణ



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న మరియన్న, అభిమన్యుడు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 13 : పంట మార్పిడి చేసి ఎకరానికి రూ.లక్ష నికర ఆదాయం ఇచ్చే ఆయిల్‌పాం తోటల సాగుకు ప్రోత్సాహం ఇచ్చే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తొర్రూరు మండలం హరిపిరాలలో ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ మేళాను ఈనెల 14 నుంచి సెప్టెంబరు 30వరకు చేపడుతున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి కోర్సా అభిమన్యుడు తెలిపారు. మహబూబాబాద్‌లోని ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో నీటి వసతి ఉన్న ప్రతి రైతు పంట మార్పిడి చేసి ఆయిల్‌పాం తోటల సాగు చేపట్టి ఎకరానికి నికర ఆదాయం పొందాలని తెలిపారు. జిల్లాలోని రైతులు ఈ మెగా ప్లాంటేషన్ మేళాలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు ఇన్సూరెన్స్ కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి

మహబూబాబాద్ టౌన్, జూలై 13 : అన్ని బ్యాంకుల్లో డ్వాక్రా మహిళలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మి కోరారు. మహబూబాబాద్‌లోని వీర భవన్‌లో శనివారం భారత జాతీయ మహిళా సమాఖ్య పట్టణ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సాంబలక్ష్మి మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో కుటీర పరిశ్రమను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డ్వాక్రా రుణాలు రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఆర్పీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. మహిళల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కౌన్సిలర్ ఎమ్డీ.ఫాతిమా, ఎర్రోజు పద్మ, అలీమా, భాగ్యమ్మ, మాధవి, రాణి, లక్ష్మి, కవిత, గంగ, ఉమ, అంజలి, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో
- దంపతులు సహా ఆటోడ్రైవర్ దుర్మరణం
- కూతురు పరిస్థితి విషమం.. మరొకరికి తీవ్ర గాయాలు
- కూతురిని బస్సు ఎక్కించేందుకు వెళ్తుండగా ఘటన

7 లో..

త్వరలోనే పోడు భూములకు పట్టాలు

- కొత్త పోడు కొట్టడం మానేయాలి
- గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జూలై 13 : పోడు భూములకు పట్టాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. కొత్త పోడు కొట్టడం మానేసి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని లింగాల గ్రామంలో శనివారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. వికలాంగులకు సదరం క్యాంపు ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళలకు మీ-సేవ కేంద్రాల ఏర్పాటు, మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై అవగాహన కల్పించి వారికి ప్రోత్సాహం అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్లను మంత్రి ఆదేశించారు. అనంతరం లింగాల, లవ్వాల, బందాల, కొడిశాల గ్రామాలకు చెందిన ప్రజల నుంచి పోడు భూములకు పట్టాలు, జీసీసీ డిపో ఏర్పాటు, రోడ్లు, కరెంటు, బస్సు రవాణా, తదితర సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు.

కార్యక్రమంలో కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తాడ్వాయి మండల ప్రత్యేకాధికారి అల్లెం అప్పయ్య, డీఈవో పాణిని, తహసీల్దార్ రవీందర్, విద్యుత్ శాఖ, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ధనసరి సీతక్క తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి మండలంలోని పోసాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆస్పత్రిని(ఆరోగ్య ఉపకేంద్రం) ఆమె ప్రారంభించారు. ఐదు మారుమూల గ్రామాల ప్రజల అవసరం కోసం కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోసాపూర్ ప్రాంతంలో గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని, వారికి ఆరోగ్య సమస్యలు వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కలెక్టర్ దివాకర ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రిలో అత్యవసర చికిత్సల కోసం నాలుగు పడకల కోసం సుమారు రూ.7లక్షలు వెచ్చించినట్లు చెప్పారు. ఇందులో అవసరమైన మందులు ఏర్పాటు చేయడంతో పాటు ఒక ఏఎన్ఎం, ఒక ఆశా కార్యకర్త విధులు నిర్వర్తిస్తారని అన్నారు. అనంతరం మంత్రి సీతక్క పోసాపూర్‌లోని గురుకులాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందుతున్నాయా.. లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- అంతర్జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ వెంకటనారాయణ

తొర్రూరు, జూలై 13 : క్రీడలతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ఉల్లాసం కలుగుతుందని అంతర్జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ కె.వెంకటనారాయణ అన్నారు. శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు, బాల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కమిటీ వేసుకొని కోర్టును అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. 50 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు వయోబేధం లేకుండా వాలీబాల్ ఆటను కొనసాగిస్తున్నారని పీఈటీ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు నగేష్, శంకర్, విప్రవీణ్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు వాలీబాల్స్ అందిస్తున్న వెంకటనారాయణ

గ్రామాల్లో పీరీల సందడి

కొట్టాల్లో కొలువుదీరిన సవార్లు

- తొమ్మిది రోజులు భక్తుల కోలాహలం
- వెల్లివిరుస్తున్న మత సామరస్యం
- ఈనెల 17న మొహర్రం



మహబూబాబాద్‌లో పీర్లను ఊరేగిస్తున్న వీరారం తండా ముజావర్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 13 : మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు కలిసి మొహర్రం వేడుకలను గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ప్రధాన కూడళ్లలోని పీరీల మసీదుల(అశూర్‌ఖాన)లో సవార్లు కొలువుదీరాయి. సవార్లను ప్రతిష్ఠించిన నాటి నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ముజావర్లు ప్రత్యేక పూజలు చేస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఊరేగుతున్న సవార్లకు భక్తులు పూలు, ఊదు, బెల్లం, దట్టీలు సమర్పించుకుంటూ మొక్కులు చెల్లిస్తుండడంతో అంతటా సందడి నెలకొంది. తొమ్మిది రోజుల పాటు పీరీ (సవార్లు)లను కొలిచి పదో రోజు (ఈనెల 17న) నీటిలో నిమజ్జనం చేసి వేడుకలను ముగిస్తారు.

పండుగ నేపథ్యం ఇదీ..

మానవ హక్కుల పరిరక్షణ కోసం 14 శతాబ్దాల క్రితమే జరిగిన చారిత్రాత్మక పోరాటమే మొహర్రం. కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో ఇస్లామిక్ మత పరిరక్షణ కోసం మహ్మద్ ప్రవక్త మనుమలు హజ్రత్ ఇమాంహుస్సేన్, హుస్సేన్‌లు ఈ మాసంలోని 10వ రోజున వీర మరణం పొందగా వారి జ్ఞాపకార్థం శోక (సంతాప) దినాలుగా ఆచరిస్తారు. అప్పటి రాజు అమీర్ మౌలానా కుమారుడు యాజిద్‌కు వారసత్వంగా రాజ్యాధికారాన్ని అప్పజెప్పడాన్ని ప్రవక్త మనుమలు హుస్సేన్, హుస్సేన్ వ్యతిరేకిస్తారు. దీంతో యాజిద్ సైన్యం వీరిద్దరిని హతమార్చేందుకు పన్నాగం పన్నుతుంది. తుదకు నమాజ్ చేస్తున్న వీరిద్దరిపై దాడి చేస్తారు. వీరిద్దరితో పాటు ఆ యుద్ధంలో రక్తసంబంధీకులు కూడా చాలా మంది చనిపోతారు. వెదురుబొంగులకు తలలను పెట్టి అపహాస్యం చేస్తూ ఊరేగించారనేది ప్రతీతి. అందుకే ప్రతి సంవత్సరం వీరి త్యాగాన్ని స్మరిస్తూ మొహర్రంను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నెలవంకను చూసి ఈ పండుగను జరుపుకోవడం మొదలుపెడతారు. పీరమ్మల కొట్టంలో పెట్టెలో దాచి ఉంచిన పీరీలను నెలవంక వచ్చిన రోజు తీసి శుభ్రం చేసి వెదురు బొంగులకు అమర్చి అలంకరిస్తారు. ఇవి అలంకరించేందుకు రెండు రోజులు పడుతుంది. ఆ తర్వాత అశూర్‌ఖానాలను (కొట్టం) శుభ్రం చేసి పీరీలను నిలబెడుతారు.

తొమ్మిది రోజులు కోలాహలం

పీరీల ఊరేగింపు సందర్భంగా తొమ్మిది రోజులు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంది. అన్ని గ్రామాల్లో పీరీలను ప్రతి ష్ఠించారు. మొదటి ఐదు రోజులు పీరీలను కొట్టాల్లోనే ఉంచగా ముజావర్లు (సాహెబ్) ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. 6వ రోజు నుంచి 9వ రోజు వరకు పీరీలను గ్రామాల్లో ఇంటింటికి మొక్కుల కోసం తిప్పుతుంటారు. 9వ రోజు ఉదయం పెద్ద ఎత్తున పాలతో మట్కీలను తయారు చేసి అగ్నిగుండం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి యాటపోతు కందూరు నిర్వహిస్తారు. అలానా(గుంత) ఏర్పాటు చేసి కట్టెలతో నిప్పు తయారు చేస్తారు. ప్రతి రోజు నిప్పులగుండం చుట్టూ తిరుగుతూ అసైదులా హారతి అంటూ ఆడుతారు. పీరీలను ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గ్రామ వీధుల్లో ఊరేగించి భక్తులిచ్చే కానుకలు స్వీకరిస్తారు. మొహర్రం సందర్భంగా పది రోజల పాటు గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. ఆ తర్వాత పదో రోజు అర్ధరాత్రి వరకు ఊరేగించి పీరీలను నీటిలో నిమజ్జనం చేస్తారు. పీరమ్మలకు భక్తులు కుడుకలు, బెల్లం, ఊదు, దట్టీలు, వెండి, బంగారు గొడుగులు, తొట్టెలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

17న మొహర్రం..

ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం నుంచి పీరీలను మరోసారి గ్రామాల్లో ఊరేగిస్తారు. పీరీలు ఏటికి పోతుంటే భక్తులంతా బెల్లం, నువ్వులు కలిపిన గట్టాలను చల్లుతుంటారు. గ్రామ శివారులోని పొలిమెర వరకు తీసుకువెళ్లాక అక్కడ పీరీలను శుభ్రం చేసి ఓ మూటకడతారు. అల్‌బిదాయో ఏకుసేని అంటూ బీబీకా ఆలం పాటను ఆలపిస్తూ పీరీలతో పాటు వాటికి అమర్చిన కర్రలు, దట్టీలను మఖానం వరకు తీసుకువస్తూ రోదిస్తుంటారు.

త్యాగస్మృతులకు నిదర్శనం

షేక్ యూసుఫ్, మతపెద్ద, బేతోల్, మహబూబాబాద్ జిల్లా



ఇమామ్ హుస్సేన్ మానవత్వానికి జీవం పోసిన ధీరుడు. ఇరాక్ రాజు యాజిద్ అన్యాయాన్ని ఎదుర్కోవడంలో వీరమరణం పొందారు. ఆయన త్యాగాలను స్మరించుకుంటూ, ధర్మ పాలనను మెచ్చుకుంటూ ప్రతి సంవత్సరం మొహర్రం మాసంలో వచ్చే ఈ శోక దినాలను జరుపుకుంటాం. అన్ని మతాల వారు పీరీల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు.

ముదిరాజ్ కులస్థులను బీసీ ఏలో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

హనుమకొండ చౌరస్తా, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కులస్థుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు బీసీ ఏలో చేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ కోరారు. హనుమకొండ 10వ డివిజన్ మచిలీబజార్‌లోని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అశోక్ పాల్గొని ముందుగా మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పిలుపు మేరకు బీసీ డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ ఏలోకి చేర్చాలనే నినాదంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముదిరాజ్ కులస్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15నుంచి 20వరకు జిల్లాలోని రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశోక్ తెలిపారు.


ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కంచాలని కోరుతూ ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ కులస్థులు

పులి రజనీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యంత ప్రాచీన, అధిక జనాభా గల కులమైన ముదిరాజ్, తెనుగోళ్లు, ముత్తరాసి అయిన తాము.. సమాజంలో అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నామన్నారు. ముదిరాజ్ అభివృద్ధి కోసం కో-అపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసి యేటా రూ.1000కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. మత్స్యశాఖలోని సొసైటీలకు ఎన్నికలు జరపాలని, అదే విధంగా ఆసరా పింఛన్ సౌకర్యాలను కల్పించాలని, ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటుతో పాటు ఉచితంగా చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలన్నారు. అధికార పార్టీలో ఎమ్మెల్యేలుగా ఉన్న ముదిరాజ్ కుల బంధువులకు మంత్రివర్గంలో స్థానం కల్పించడంతో పాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని రజనీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ సభ్యులు చొప్పరి సోమయ్య, ఎన్ఆర్‌వి రాజ్‌కుమార్, పిట్టల సత్యనారాయణ, రవికుమార్, మహేందర్, బయ్య శోభన్, పులి మధు, కుమారస్వామి, సారంగపాణి, సాంబమూర్తి, విక్రమ్, బుచ్చిరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల గుట్కా పట్టివేత


పట్టుకున్న గుట్కాతో పోలీసులు

వరంగల్ క్రైం, జూలై 13: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేబీహెచ్ఎస్ కాలనీలో రూ.2లక్షల విలువైన గుట్కాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాలనీలో నాగరాజు అనే వ్యక్తి వద్ద గుట్కా నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకుని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. దాడిలో నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

కేయూలో సైన్స్ పీజీ కోర్సుల తరగతులు షురూ..

కేయూ క్యాంపస్, జూలై 13: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం పీజీ సైన్స్ కోర్సుల మొదటి సెమిస్టర్ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాల్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడారు. కేయూలో ఈ ఏడాది దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల్లో అడ్మిషన్లు బాగా పెరిగాయని చెప్పారు. జువాలజీ, బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, గణితశాస్త్రం కోర్సుల్లో స్టడీ మెటీరియల్‌ను అందచేస్తామని చెప్పారు. విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. థియరీ క్లాస్‌లకు విద్యార్థులకు రెగ్యులర్‌గా హాజరుకావాలని, తర్వాత ప్రాక్టికల్స్ క్లాస్‌లు నిర్వహిస్తామని చెప్పారు. వర్సిటీలో మొదటిదఫాగా యూజీసీ డెబ్ ఆదేశాల మేరకు సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్‌డీఎల్‌సీఈ సైన్స్ కోర్సుల సహ సంచాలకుడు డాక్టర్ వెంకటగోపీనాథ్ మాట్లాడుతూ.. రెగ్యులర్ కోర్సులకు దీటుగా దూరవిద్య విధానంలో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ విభాగాల అధిపులు డాక్టర్ భారవీశర్మ, డాక్టర్ మంజుల, డాక్టర్ ఇస్తారీ, డాక్టర్ లలితకుమారి, డాక్టర్ ముస్తాఫా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ హన్మంతు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.


హాజరైన ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఇతర అధ్యాపకులు

వరంగల్‌పై సీఎందీ నాదీ ఒకే విజన్

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం : 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

ఇంటర్వ్యూ INTERVIEW

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే సీఎం రేవంత్‌రెడ్డి విజనే తన విజన్‌గా పని చేస్తానని, ఎయిర్‌పోర్టు, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీని తీసుకరావటంతో పాటు రింగ్ రోడ్, సాఫ్ట్‌వేర్ కంపెనీలను నెలకొల్పడం లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా) నూతన చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన కుడా అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వెల్లడించారు. పేదలకు కుడా ప్లాట్లను అందుబాటులోకి తీసుకరాడటంతో పాటు కుడా పరిధిని విస్తరించటం.. కాళోజీ కళాక్షేత్రం, వరంగల్ బస్టాండ్ నిర్మాణం, నగరంలో జంక్షన్‌ల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: కుడా చైర్మన్‌గా ఎంపిక కావటంపై మీ స్పందన?

ఇనుగాల వెంకట్రామిరెడ్డి: కాంగ్రెస్‌లో ఓ సాధారణ కార్యకర్తగా.. పార్టీ ఏ కార్యక్రమం ఇచ్చినా విజయవంతంగా పని చేశా. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నా. 2018, 2023లో కొన్ని కారణాల వల్ల పార్టీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీ అభ్యున్నతికి కృషి చేశా. రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పాటు ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో శక్తివంచన లేకుండా కృషి చేశా. ఇవన్నీ సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించి కుడా చైర్మన్ పదవిని అప్పగించారు. ఈ రెండేళ్ల కాలంలో వరంగల్ కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తల కష్టాసుఖాల్లో పాలుపంచుకుంటా. ప్రజలకు సేవ చేసేందుకు కూడా చైర్మన్ పదవి దక్కింది. తప్పకుండా సీఎం సహకారంతో కుడా పరిధిలో నా మార్కు అభివృద్ధి ఉండేలా పని చేస్తా.

ఆంధ్రజ్యోతి: కుడా చైర్మన్‌గా మీ విజన్ ఏంటి?

వెంకట్రామిరెడ్డి: సీఎం రేవంత్‌రెడ్డికి వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే పట్టు దలతో ఉన్నారు. ఆయన ఏ విజన్‌తో ఉన్నారో నేనూ అదే విజన్‌గా పని చేస్తా. ప్రధానంగా వరంగల్‌కు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పూర్తి చేయటం లక్ష్యంగా పెట్టుకున్నాం. అలాగే ఎయిర్‌పోర్టుకు దారిని విస్తరించడంతో పాటు త్వరలోనే వరంగల్ మామునూరు నుంచి విమానాలు ఎగిరేలా పని చేస్తున్నాం. ఇప్పటికే చాలా వరకు పూర్తి అయినా రింగ్‌రోడ్డు పనులు ఇంకో ఐదారు కిలో మీటర్ల వరకు మిగిలి ఉంది. దీనికి కావాల్సిన రూ.300కోట్ల వరకు సీఎం మంజూరుకు హమీ ఇచ్చారు. త్వరలోనే రింగ్‌రోడ్డును పూర్తి చేస్తాం. ప్రస్తుతం కుడా ఆధ్వర్యంలో మూడు వెంచర్లున్నాయి. వాటిలో పేదలు ప్లాట్లు కొనేలా అభివృద్ధి చేస్తున్నాం. నగరం చుట్టూ అనధికారిక ప్లాట్లు భారీగా ఏర్పాటు చేశారు. వాటిని గుర్తించి లేఅవుట్‌లుగా మార్చేలా ప్రయత్నాలు చేస్తాం. నాన్ లేఅవుట్ ప్లాట్లలో ప్లాట్ కొనుగోలు చేయకుండా ప్రజల్లో అవగాహన తీసుకవస్తాం. ఫామ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న భూక్రయ విక్రయాలపై దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: హైదరాబాద్‌కు దీటుగా అంటే ఎలాంటి అభివృద్ధి చేస్తారు?

వెంకట్రామిరెడ్డి: హైదరాబాద్ నగరంలో ఉన్న సౌకర్యాలు వరంగల్ వాసులకు తీసుకరావటం ప్రధానం. అలాగే వరంగల్‌లో ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. దీన్ని పూర్తి చేస్తే అంతర్జాతీయ క్రీడలు ఇక్కడే నిర్వహిస్తారు. 50 ఎకరాల్లో కొత్తగా స్టేడియం ఏర్పాటు చేసి వరంగల్‌ను స్పోర్ట్స్ సిటీగా అభివృద్ధి చేయాలనేది నా లక్ష్యం. అలాగే మెడికల్ హబ్‌గా వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రజలు వైద్యం కోసం వరంగల్‌కు వచ్చేలా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు కావాల్సిన భూమిని కూడా సమకూర్చుతుంది. ఐటీ కంపెనీలను వరంగల్‌కు తీసుక వచ్చేందుకు దృష్టి పెడుతున్నాం. మడికొండ ఏరియాలో డంపింగ్ యార్డు నుంచి చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్లాన్ చేస్తున్నాం. దీంతో ఐటీ కంపెనీల ఏర్పాటుకు చాల వరకు ఆటంకాలు లేకుండా పోతుంది.

ఆంధ్రజ్యోతి: కుడా చేపట్టిన పనుల్లో పురోగతి ఎలా ఉంది?

వెంకట్రామిరెడ్డి: కుడా ఆధ్వర్యంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ప్రయోజనం ఉండే పనులపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వం అంచనాలు లేకుండా కొన్ని పనులు చేపట్టి మధ్యలోనే వదిలేసింది. వాటిలో ప్రధానంగా బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రాన్ని రూ.90కోట్లతో చేపట్టి నిధులు లేక మధ్యలోనే వదిలేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కాళోజీ కళాక్షేత్రాన్ని సెప్టెంబరు 9వ తేదీలోపు పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాం. ఇప్పటి వరకు 80శాతం పనులు చేశాం. అలాగే వరంగల్ బస్టాండ్‌కు రూ.250కోట్లు కేటాయించాం. మొదటి విడతలో రూ.125 కోట్లతో చేపట్టే పనులను కుడా ఆధ్వర్యంలో ప్రారంభించారం. మోడల్ బస్టాండ్‌గా అభివృద్ధి చేస్తాం. వరంగల్ ఓ సిటీ ఏరియాలో కుడా 8 ఎకరాల వరకు భూమి ఉంది. ఈ భూమిని ఏలా అభివృద్ధి చేయాలో స్థానిక మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. వరంగల్ మహానగరంలో జంక్షన్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కుడా పరిధి పెంచటం.. మాస్టర్ ప్లాన్‌పై మీ వైఖరి?

వెంకట్రామిరెడ్డి: కుడా పరిధిని కచ్చితంగా పెంచుతాం. ప్రస్తుతం కుడా పరిధిలో 180 గ్రామాలున్నాయి. సుమారు 25కిలో మీటర్ల వరకే కుడా విస్తరించి ఉంది. దీన్ని ఎంత మేర పెంచాలనే దానిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అభిప్రాయాలను తీసుకుని నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వం తీసుకవచ్చిన మాస్టర్ ప్లాన్‌ను మారుస్తున్నాం. సీఎం ఆదేశాల మేరకు 2050 వరకు ఉపయోగపడేలా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నాం. మరో మూడు, నాలుగు నెలల్లో దాన్ని అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: వ్యాపారంలో స్థిరపడిన మీరు రాజకీయాల్లోకి రావాలని ఎందుకనుకున్నారు?

వెంకట్రామిరెడ్డి: మా కుటుంబం వ్యాపార పరంగా స్థిరపడింది. మా ఒక్క కూతురూ కెనడాలో ఉన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు ఉపాధ్యక్షుడిగా, డక్కన్ క్రానికల్ సీఈవోగా పని చేశా. 2012లో పరకాల ఎమ్మెల్యే కొండా సురేఖ వైసీపీలోకి వెళ్లటంతో నాటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డితో ఉన్న సత్సంబంధాలతో ఆయన పరకాల రాజకీయాల్లోకి పంపారు. ఆ తరువాత సొంత గడ్డపై ప్రజలకు సేవల చేయాలనే లక్ష్యంతో 2013 సహకార ఎన్నికల్లో పోటీ చేశా. ఇక ఖమ్మం శారద కాలేజీలో స్టూడెంట్ ఉన్నప్పుడు లీడర్‌గా పని చేసిన అనుభవం ఉండటంతో రాజకీయాల్లో సులభంగానే నెట్టుకవచ్చాను. 2023లో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ నుంచి తప్పుకున్నా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. ఆ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తీసుకునే నిర్ణయంపై పోటీ గురించి ఆలోచిస్తా. పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, మంత్రి సురేఖతో సహ ఎవరితోనూ ఎలాంటి విబేధాలు లేవు. అందరితో కలిసి పని చేస్తా. ఈ రోజు కుడా కుర్చీలో కూర్చున్నానంటే అది కేవలం కార్యకర్తల కష్టఫలమే. వారికి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా.



రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కోసం ప్రశ్నిస్తా..

● వరంగల్ ఎంపీ కడియం కావ్య ● రైల్వే సమస్యలపై టీ రైల్వే జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

కాజీపేట, జూలై 13: కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధనకోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లైనా ప్రశ్నిస్తానని, డివిజన్ సాధనే లక్ష్యం పని చేస్తేనే తన రాజకీయ జీవితానికి సార్థకం అవుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. రైల్వే సమస్యల పరిష్కారానికి తెలంగాణ రైల్వేఎంప్లాయీస్ జేఏసీలో తనకు కూడా సభ్యత్వం ఇవ్వాలన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రైల్వే సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.. జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీ కడియం కావ్య పాల్గొని మాట్లాడారు. వరంగల్ ఎంపీగా ప్రతీ సమస్యపై పోరాటం చేస్తానన్నారు. ఒక ఏడాదిలో పలు సమస్యలపై పార్లమెంట్‌లో పదిసార్లు మాట్లాడిన కడియం శ్రీహరి బిడ్డగా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్‌లో తనగొంతు వినిపిస్తానని ఉద్వేగంగా ప్రసంగించారు. కాజీపేటలో ప్లాట్‌ఫారాల విస్తరణ, లోకోపైలెట్‌ల సమస్యలు, రైల్వేలో ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్ఎస్ఎస్ ముసుగులో ప్రధాని మోదీ రిజర్వేషన్‌లు ఎత్తివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అంబేద్కర్ అన్ని వర్గాలకు న్యాయం చేశారని గుర్తుచేశారు. రాహుల్ గాంధీకి అన్ని సమస్యలపై అవగాహన ఉందన్నారు. రైల్వే బడ్జెట్‌లో కాజీపేటకు వాటా వచ్చే వరకు నిరంతర పోరాటం చేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి ఎవరికీ భయపడే ప్రసక్తేలేదన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాజీపేటకు రైల్వేపరంగా కేంద్రం నుంచి న్యాయం జరగాలంటే తెలంగాణ ఎంపీలతో టీరైల్వే జేఏసీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రైల్వేలో ఉద్యోగాలు మన పిల్లలకు దక్కాలంటే రైల్వే పోటీ పరీక్షల్లో అర్హత సాధించే విధంగా చదవాలన్నారు. ఆర్ఆర్‌బీ, ఆర్ఆర్‌సీ పరిధిలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిందేనన్నారు. రైల్వేపరంగా కాజీపేటకు రావాల్సిన విషయాలపై ప్రత్యేక నివేదికను రూపొందించాలని జేఏసీ నాయకులకు సూచించారు. కాజీపేటలో అదనపు ఆర్వోబీని ఆరునెలల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. రైల్వే వ్యాగన్ పరిశ్రమలో భూమి కోల్పోయిన రైతులకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.5కోట్ల నష్టపరిహారం ఇప్పించానని చెప్పారు. పెన్షనర్ల కార్యాలయానికి స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ పిల్లలమర్రి రవీందర్, జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, ఆలిండియా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బి.వీరన్న, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. సంగమయ్య, కృష్ణమూర్తి, సంఘ్ సీడబ్ల్యూసీ మెంబర్ సీహెచ్ మురళి, సంఘ్ డివిజనల్ అధ్యక్షుడు కొత్త మురళి, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, కోశాధికారి సీహెచ్ తిరుపతి, ఆల్ బ్రాంచ్ కో-ఆర్డినేటర్ నాయిని సదానందం, స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతోపాటు పలువురు నాయకులు రైల్వే సమస్యలపై చర్చించి రైల్వే పరిశ్రమల సాధన, తదితర విషయాలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు మూడు గంటలపాటు జరిగిన ఈ రౌండ్‌టేబుల్ చర్చా వేదికలో రైల్వే కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో ఘోర రోడ్డు ప్రమాదం

గేదె కళేబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఢీకొట్టిన ఆటో

దంపతులు, కూతురు సహా ఆటోడ్రైవర్ దుర్మరణం

మరొకరికి తీవ్ర గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో

ఏటూరునాగారం రూరల్, జూలై 13 : రోడ్డుకు అడ్డంగా ఉన్న గేదె కళాబరాన్ని తప్పించబోయి కంటైనర్‌ను ఆటో ఢీ కొట్టడంతో దంపతులతోపాటు వారి కూతురు, ఆటోడ్రైవర్ మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఆటోడ్రైవర్‌కు తోడుగా వచ్చిన మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. కూతురిని బస్సు ఎక్కించేందుకు ఆ దంపతులు తమ గ్రామానికి చెందిన ఓ ఆటోను కిరాయికి తీసుకుని బయల్దేరిన క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది.

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణరాజు(72), కాకర్లపూడి సత్యవతి(65) దంపతులు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తునిలో నివాసముంటున్న తన కూతురు సాగిరాజు అనిత (45)ను ఆమె ఊరికి పంపించేందుకు వాజేడు నుంచి ఏటూరునాగారంనకు శనివారం రాత్రి బయల్దేరారు. ఈ క్రమంలో వాజేడుకు చెందిన తలాండి నాగరాజుకు చెందిన ఆటోను కిరాయికి మాట్లాడుకోగా.. ఆటోలో వీరి ముగ్గురితో పాటు డ్రైవర్ నాగరాజుకు తోడుగా ఉండేందుకు అంజిరెడ్డి అనే మరోవ్యక్తి కూడా వచ్చాడు. వారి ఆటో ఏటూరునాగారం వస్తున్న క్రమంలో 163వ జాతీయరహదారిపై హైస్ట్రీట్ సమీపంలో రోడ్డుపై ఓ పాడిగేదే మరణించి ఉంది. ఆ కళేబరాన్ని తప్పించబోయి ఆటో ఎదురుగా వాజేడు వైపు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టి ఆటో బోల్తా కొట్టింది. దీంతో కాకర్లపూడి సత్యనారాయణరాజు, కాకర్లపూడి సత్యవతితో పాటు డ్రైవర్ నాగారాజు అక్కడికక్కడే మృతి చెందగా సాగిరాజు అనిత, అంజిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే వారిని తొలుత మండలకేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందింది.

సత్యనారాయణరాజు, సత్య వతి, నాగరాజు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు జిల్లా ఆసుపత్రికి తర లించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. ఇదిలా ఉంటే ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ వాహనంతో సహా పారితుండగా వాజేడు మండలం జగన్నాథపురానికి చెందిన వారు ఆ కంటైనర్‌ను అడ్డుకోగా వాహనా న్ని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన అనిత


చికిత్స పొందుతున్న అంజిరెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మండల కేంద్రంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వేణుమాధవ్

పెద్దవంగర, జూలై 13 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలతో ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కాల్వలు, కుంటల్లో బలహీన కట్టలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2.10లక్షల సాయం



పాపారావు కుటుంబసభ్యులకు రూ.2.10లక్షల చెక్కు అందజేస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, జూలై 13 : గూడూరు మండల కేంద్రంలో ఇటీవల లారీ ప్రమాదంలో మృతి చెందిన సీఐ గన్‌మన్ ధనసరి పాపారావు కుటుంబానికి 2018 బ్యాచ్ పోలీసు అధికారులు, సహోద్యోగులు రూ.2.10లక్షల ఆర్థిక సాయం అందించారు. పాపారావు కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో గూడూరు సీఐ బాబురావు, ఎస్సై నగేష్, కొత్తగూడ ఎస్సై దిలీప్, గంగారం ఎస్సై రవితో పాటు ఆయా పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే సిబ్బంది అంతా తలా కొంత వేసుకుని రూ.2.10 లక్షలను సేకరించారు. సదరు చెక్కును మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ చేతుల మీదుగా కానిస్టేబుల్ పాపారావు కుటుంబ సభ్యులకు శనివారం అందజేసి ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమంలో మానుకోట డీఎస్పీ తిరుపతిరావు, సీఐలు బాబురావు, సర్వయ్య, ఉపేందర్, ఎస్సైలు నగేష్, దిలీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో లయన్స్ ముందుండాలి



జిల్లా ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్ టౌన్, జూలై 13: సామాజిక సేవలో లయన్స్ సభ్యులు ముందు వరుసలో నిలవాలని లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు డాక్టర్ వి.జగన్మోహన్ రావు, జోనల్ చైర్మన్ రావుల రవిచందర్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవ చేయడానికి ముందుకు రావాలని, ఇతరులకు తోచిన సాయాన్ని అందించి మానవతను చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు అనుమాల వెంకటేశ్వర్లు, చాడ అశోక్‌రెడ్డి, సిద్ధార్థ, డాక్టర్ రాజ్‌కుమార్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, వైద్యులు శ్రీనివాస్, స్వామి, అశోక్, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి : ఎస్సై



పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్సై సీహెచ్.నగేష్

గూడూరు, జూలై 13 : సైబర్ నేరాల పట్ల ప్రజలతో పాటు యువతను అప్రమత్తం చేయాలని ఎస్సై సీహెచ్.నగేష్ అన్నారు. గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు సిబ్బందితో ఫంక్షనల్ వర్టికల్ పనితీరుపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నగేష్ మాట్లాడుతూ... డయల్ 100కు వచ్చిన ఫిర్యాదుల పట్ల స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో బీట్‌లు, పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాలను నియంత్రించాలని చెప్పారు. పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా ఉంటూ విధులను క్రమశిక్షణ నిర్వహించాలని పేర్కొన్నారు. గంజాయి, గుడుంబా అక్రమ రవాణా పట్ల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన దళితులకు న్యాయం చేస్తాం

- కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌రెడ్డి



మండల కేంద్రంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత డాక్టర్ రవీందర్ రెడ్డి

పెద్దవంగర, జూలై 13 : దళితులకు మూడెకరాల భూమి పంపిణీలో అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలకేంద్రంలో పలువురు దళితనాయకులతో కలిసి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూడు ఎకరాల భూమి పంపిణీ చేయడంలో గత పాలకులు నిబంధనలకు విరుద్ధంగా అనర్హులను ఎంపిక చేశారని తెలిపారు. గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా విచారణ చేసి అర్హులను ఎంపిక చేయాలని తెలిపినా అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేశారని పేర్కొన్నారు. అర్హులైన దళితులను గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. సమావేశంలో దళిత సంఘం నాయకులు చిలుక సోమయ్య, వెంకటయ్య, బక్కమ్మ, శ్రీను ఎ.వెంకన్న, సరోజ, ఉపేంద్ర, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి వస్తువుల పంపిణీ



యాకమ్మకు వస్తువులు అందజేస్తున్న యూత్

నెల్లికుదురు, జూలై 13 : మండలంలోని రాజులకొత్త పల్లి గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేద కుటుంబానికి నెల రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేశారు. నిరుపేద అయిన మాతంగి యాకమ్మకు సరుకులు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ సభ్యులు హరీష్, అశోక్, వెంకటేష్, విష్ణు, అంజి, ప్రశాంత్, సన్నీ, శ్రీలత, చిరంజీవి, సాయి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన ఇద్దరి అరెస్టు



స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

డోర్నకల్, జూలై 13: ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుల అరెస్టు చూపి వివరాలను వెల్లడించారు. ఈనెల 4న ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురంకు చెందిన బద్దెల వీరబాబు అనే వ్యక్తి పని నిమిత్తం డోర్నకల్‌కు వచ్చాడు. పాత పోలీస్‌స్టేషన్ వద్ద తన టీవీఎస్ 50 ఎక్స్‌ఎల్ వాహనాన్ని నిలిపి టీ తాగేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెదికినా దొరక్కపోవడంతో 7న వీరబాబు డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఎస్సై తిరుపతి సిబ్బందితో డోర్నకల్‌లోని గ్యాస్ గోదాం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు చెట్లల్లో దాచిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని తీసుకురావడం గమనించారు. వారిపై అనుమానం రావడంతో పిలిచి విచారించారు. దీంతో తాము చోరీ చేసిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం ఇదేనని ఎస్సైకి తెలిపారు. అలాగే ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురంకు చెందిన దరావత్ శ్రీను, చొప్పరి నాగరాజుల మరో రెండు ద్విచక్ర వానాలు సైతం ఉన్నాయని పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు వారి వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

సీపీఐ మండల కార్యదర్శిగా స్వామి



నెల్లికుదురు, జూలై 13 : సీపీఐ నెల్లికుదురు మండల కార్యదర్శిగా మునిగలవీడు గ్రామానికి చెందిన బైస స్వామిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి తెలిపారు. అలాగే మండల సహాయ కార్యదర్శులుగా తూటి వెంకట్‌రెడ్డి, చిర్ర సత్య నారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సీపీఐ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఎంపీ బలరాంనాయక్‌కు సన్మానం

మహబూబాబాద్ టౌన్, జూలై 13: మహబూబాబాద్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో ఈనెల 14న మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ పోరిక బలరాంనాయక్ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, యువజన కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ కోరారు.

వైద్యం వికటించి బాలుడి మృతి



తనీష్ మృతదేహం

నెహ్రూసెంటర్, జూలై 13 : ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని డోర్నకల్ మండలం బూర్గుపాడ్ గ్రామానికి చెందిన కొత్త రాంబాబు-ప్రియ దంపతుల కుమారుడు తనీష్(12) వరిబీజం సమస్యతో బాధపడుతుండగా మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యుల సలహా మేరకు కుటుంబసభ్యులు సర్జరీ చేయించారు. వైద్యం వికటించడంతో పరిస్థితి విషమించింది. వైద్యుడు మెరుగైన వైద్యం కోసం బాలుడిని జిల్లా కేంద్రంలోని మరో ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తనీష్ మృతి చెందాడు. బాలుడి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 13: హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బెల్లయ్యనాయక్ శనివారం వేం నరేందర్‌రెడ్డిని కలుసుకున్నారు. బెల్లయ్యనాయక్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి

శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు

- ఫలించిన యువకుడి పోరాటం



పూలబజారు కాలనీలో కంకర మిక్స్‌తో రోడ్డేస్తున్న మునిసిపల్ సిబ్బంది

మరిపెడ, జూలై 13 : ఓ యువకుడి పోరాటం ఫలితంగా మరిపెడ మునిసిపల్ అధికారులు బురద రోడ్డుపై శరవేగంగా కంకర మిక్స్‌తో తాత్కాలికంగా మరమ్మతు పనులను శనివారం చేపట్టారు. బురద రోడ్డుపై కూర్చొని యువకుడు నిరసన తెలపడంతో కొద్ది రోజుల్లోనే ఆ కాలనీ రోడ్డును సీసీగా మారుస్తామని మునిసిపల్ అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు. మరిపెడ మునిసిపల్ పరిధి పూలబజారు కాలనీలోని ఓ గల్లీ రోడ్డు కొన్నేళ్లు బురదమయంగా ఉండి కాలనీ ప్రజలు నడవడానికి అరిగోస పడుతున్న విషయాన్ని కాలనీకి చెందిన మహమ్మద్ ముక్తార్ అహ్మద్ వాట్సప్ ద్వారా మునిసిపల్ అధికారులు, జిల్లా అధికారులకు వీడియో, ఫొటోలు పంపించారు. బురద రోడ్డు సమస్యను సత్వరం పరిష్కరించకుంటే తాను కుటుంబ సభ్యులతో సహా సూసైడ్ చేసుకుంటానని సామాజిక మాధ్యమాలలో హెచ్చరించారు. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ యువకుడు శుక్ర, శనివారం రోజు కాలనీలోని బురద రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. అతనికి తోడుగా శనివారం కాలనీవాసులు కలిశారు. యువకుడి నిరసన తెలిసి సమస్యను గుర్తించిన మునిసిపల్ అధికారులు ట్రిప్పర్లతో కంకర మిక్స్ తీసుకొచ్చి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. పట్టువదలని విక్రమార్కుడిలా కొన్నేళ్ల సమస్యపై తన నిరసనను కొనసాగించి పంతం నెగ్గించుకున్న ముక్తార్ అహ్మద్‌ను పలువురు ప్రశంసించారు.

చేపపిల్లల పథకం కొనసాగింపు..

- మత్స్యకారుల్లో ఆనందం



మహబూబాబాద్‌లోని ఓ చెరువులో చేపల దిగుబడి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 13 : ఎట్టకేలకు ఉచిత చేపపిల్లల పథకం కొనసాగింపుకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బడ్జెట్ కేటాయించి మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లల సరఫరాకు టెండర్లు కూడా పిలిచారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపపిల్లల పథకం ప్రవేశపెట్టగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పథకంపై నీలినీడలు కమ్ముకోవడంతో ఈ పథకం ఉండాలా.. వద్దా అనేది సందిగ్ధంలో పడింది. చివరకు కొంత ఆలస్యమైనా ఈ పథకాన్ని తిరిగి ప్రారంభించేందుకు నిర్ణయించింది. జిల్లాలో 1,229 చెరువుల్లో 4.21 లక్షల చేపపిల్లలు ఉచితంగా వేయనున్నారు. జిల్లాలో 189 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలలో 14,304 మంది మత్స్యకారులు, 12 మహిళా సంఘాలు ప్రత్యక్షంగా ఉచిత చేపపిల్లల పథకంపై ఆధారపడి జీవిస్తున్నారు. గతేడాది వేసిన చేపపిల్లల వల్ల 19,806 టన్నుల ఉత్పత్తి రావడం జరిగింది. పథకం కొనసాగింపుపై ఉత్కంఠ నెలకొనడంతో ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో మత్స్యకారుల్లో ఆనందం నెలకొంది.

చేపపిల్లల టెండర్లకు దరఖాస్తు చేసుకోండి

మహబూబాబాద్ అగ్రికల్చర్ : ఉచిత చేపపిల్లల సరఫరాలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం మత్స్యశాఖ నుంచి ఆన్‌లైన్‌లో టెండర్లు పిలవడం జరిగిందని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 945 చెరువుల్లో 37-40 మిల్లీమీటర్ల సైజు 201.201 లక్షలకు, 284 చెరువుల్లో 80-100 మిల్లీమీటర్ల సైజు వరకు 220.480 లక్షల చేపపిల్లలు సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు. చేపపిల్లలు సరఫరా చేయడానికి ఆసక్తిగల వారు ఈనెల 15 నుంచి 23 వరకు www.tender.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ట్రైబల్ వర్సిటీ స్థలం చుట్టూ హద్దురాళ్లు

ములుగు, జూలై 13 : సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం ప్రభుత్వం సేకరించిన స్థలం చుట్టూ రెవెన్యూ అధికారులు హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. జూన్ 22న గట్టమ్మ సమీపంలో యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ దివాకర.. రైతులు, అటవీశాఖ నుంచి సేకరించిన 337 ఎకరాల చుట్టూ హద్దులు నిర్ణయించాలని అధికారులకు సూచించారు. వెంటనే పనులు మొదలుపెట్టిన అధికారులు యూనివర్సిటీ పేరును సూచించేలా ఎస్ఎస్‌సీటీయూ అని ఇంగ్లిషు అక్షరాల్లో రాసిన రాళ్లను పాతించారు. గట్టమ్మ, పానీశ, ప్రేమ్‌నగర్, మాధవ రావుపల్లి వరకు ఈ భూములు విస్తరించి ఉండగా అన్ని చోట్లా ఈరాళ్లను పాతించారు. ఎవ్వరైనా ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

బొగత వద్ద పర్యాటకుల సందడి



వాజేడు, జూలై 13: తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద శనివారం పర్యాటకుల సందడి కనిపించింది. వారంత సెలవు కావడంతో సూదరు ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. పాలనురగలా జాలువారుతున్న జలధారలను చూసి మంత్రముగ్ధులయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం అందాలు కనువిందు చేస్తుండగా పర్యాటకులు తన్మయత్వం పొందారు. జలపాతం ఈత కొలనులో జలకాలాడారు. బొగత అందాలను కెమెరాల్లో బంధిస్తూ సెల్ఫీలు దిగారు. బొగత జలపాతం వద్ద వారాంత సెలవుల్లో ఇక నుంచి పోలీసుల ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీఐ కుమార్‌కు ఓఎస్డీ మహేష్ గితే బాబా సాహెబ్ సూచించారు. జలపాతాన్ని సందర్శించిన ఆయన అక్కడున్న రక్షణ చర్యలపై ఆరా తీశారు. సూదుర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల్లో కొంత మంది మద్యం సేవించి వచ్చే ఆస్కారం ఉండటంతో వారిపై నిఘా ఉంచాలన్నారు. శని, ఆదివారాల్లో మధ్యాహ్న సమయాల్లో పోలీసులు జలపాతం వద్ద రక్షణ చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు.

గంజాయి అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

- ఆరు నెలలుగా రహస్యంగా సరఫరా
- ముగ్గురి అరెస్టు.. పరారీలో ఒకరు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్ ఖరే, స్వాధీనం చేసుకున్న గంజాయి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 13: గంజాయి అంతర్రాష్ట్ర ముఠా గుట్టును గణపురం పోలీసులు రట్టు చేశారు. ఆరు నెలలుగా ఎవరికీ అనుమానం రాకుండా జిల్లా పరిసర ప్రాంతాలకు సరఫరా చేస్తూ చివరకు పట్టుబడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిరణ్ ఖరే ఈ మేరకు వివరాలు వెల్లడించారు. గణపురం ఎస్సై సాంబమూర్తి నేతృత్వంలో శనివారం గాంధీనగర్ క్రాస్ సమీపంలో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద కిలో గంజాయి లభ్యమైంది. ఆ వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా తమ వద్ద ఇంకా గంజాయి ఉన్నట్లు ఒప్పుకున్నారు. వారు నివాసముంటున్న గదికి వెళ్లి తనిఖీ చేయగా మరో ఐదు కిలోల గంజాయి లభ్యమైంది. వారిని ఆరా తీయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

బీహార్ రాష్ట్రం నలంద జిల్లా హిస్సా మండలం గౌరీ గ్రామానికి చెందిన గణేష్ ఠాకూర్, అదే గ్రామానికి చెందిన మింటు కుమార్, చందన్ పాశాన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ ఆరు నెలల కిందట గణపురం మండలం చెల్పూరులోని రైస్ మిల్లులో పని చేసేందుకు వచ్చినట్లు తేలింది. రైస్ మిల్లులో పనితోపాటు గంజాయిని తీసుకొచ్చి జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు అంగీకరించారు. ప్రదీప్ పరారీలో ఉండగా మిగిలిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ డి.మల్లేష్, గణపురం ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తౌర్యతండా యువకుడికి 'శాస్త్రవేత్త-డీ' హోదా

కేసముద్రం, జూలై 13 : మండలంలోని మహమూద్‌పట్నం శివారు తౌర్యతండాకు చెందిన మూడావత్ మోహన్‌కు బెంగుళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సీడాట్ నుంచి 'శాస్త్రవేత్త-డీ' హోదా లభించినట్లు శనివారం ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని మారుమూల గిరిజన తండా నుంచి శాస్త్రవేత్తగా ఎదగడం పట్ల తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

గౌడ కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షల సహాయం



చెక్కు అందచేస్తున్న రాజ్యసభ సభ్యుడు రవిచంద్ర

కేసముద్రం, జూలై 13 : మండలంలోని ఇంటికన్నెలో నిర్మించే గౌడ సంఘం కమ్యూనిటీ హాల్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని హైదరాబాద్‌లో శనివారం సంఘం బాధ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గందసిరి శ్రీనివాస్, కారుపోతుల యాకయ్య, ముంజ కుమారస్వామి, చిర్ర శ్రీధర్, నలమాస సందీప్ పాల్గొన్నారు.

నర్సరీల్లో నాణ్యమైన మొక్కలు పెంచాలి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న



డోర్నకల్ మండలంలో నర్సరీని తనిఖీ చేస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న

డోర్నకల్, జూలై 13 : డోర్నకల్ మండలంలోని నర్సరీల యాజమానులు నాణ్యమైన మొక్కలను పెంచి రైతులకు అందించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. శనివారం మండలంలోని వివిధ నర్సరీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ... నర్సరీల యాజమానులు నర్సరీ చట్టం నిబంధనలు అనుసరించి ఎప్పటికప్పుడు పెంచే వివరాల మొక్కలను నమోదు చేయాలని సూచించారు.

సంగీత, నాటక అకాడమీ చైర్మన్‌ను కలిసిన నేతలు

కేసముద్రం, జూలై 13 : రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పుంజాల అలేఖ్య, డాక్టర్ వినయ్‌కుమార్ దంపతులను శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్రభారతిలో కేసముద్రం మున్నూరుకాపు సంఘం నాయకులు కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి చందా గోపి, బనిశెట్టి వెంకటేష్, సింగంశెట్టి యాకాంతం, మామిడి శోభన్, సారంగం, లోకేష్ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ షర్ఫొద్దీన్

కురవి, జూలై 13 : కురవి మండలం నేరడ గ్రామంలో శనివారం పిచ్చికుక్క దాడిలో ఇద్దరు గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... గ్రామంలోకి మధ్యాహ్నం సమయంలో ప్రవేశించిన పిచ్చికుక్క రోడ్డుపై నిలబడి ఉన్న షేక్ షర్ఫొద్దీన్‌ను కరిచి గాయపరిచింది. అలాగే రాయినిపట్నం రహదారిలో నడిచి వెళ్తున్న రాములమ్మ అనే మహిళను సైతం కరిచింది. వీరిని గ్రామస్తులు మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గిరిజన కుటుంబాన్ని హత్య చేసిన వ్యక్తిని శిక్షించాలి

కురవి, జూలై 13 : వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల తండాలో గిరిజన కుటుంబమైన బాదావత్ సుగుణ-శ్రీనులను హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు మాలోతు కిషన్ డిమాండ్ చేశారు. గిరిజనులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని, పోలీసులు, రాజకీయ నాయకులు శ్రద్ధ వహించి గిరిజనులపై దాడులను అరికట్టాలన్నారు. హనుమాన్ నాయక్, ఆంజనేయులు, శత్రు, హరియ పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

డోర్నకల్, జూలై 13 : సైకిల్ పైనుంచి కిందపడడంతో గాయాలు కాగా మానకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ ఉపేందర్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం... డోర్నకల్ మండలం రావిగూడెంకు చెందిన మండ వెంకన్న(55) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గతేడాది వెంకన్న సైకిల్‌పై వెళ్తుండగా సీతారామ ప్రాజెక్టు కాలువ వద్ద ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. ఈప్రమాదంలో వెంకన్న తుంటికి గాయమైంది. గాయం మానకపోవడంతో కూలీ పనులకు వెళ్లలేక పోతున్నాననే మనస్తాపానికి గురై వెంకన్న ఈనెల 11న బాత్రూంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 ద్వారా ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. శనివారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



ఉప్పరపల్లిలో అగ్ని ప్రమాదం జరిగిన ఇల్లు

కేసముద్రం, జూలై 13 : మండలంలోని ఉప్పరపల్లిలో గంట వీరయ్య ఇంట్లో శుక్రవారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో రిఫ్రిజిరేటర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మరో గదిలో నిద్రిస్తున్న వీరయ్య దంపతులు లేచే సరికి ఇళ్లంతా పొగ వ్యాప్తి చెందగా మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రిఫ్రిజిరేటర్‌తో పాటు ఇంట్లో సూట్‌కేసులో దాచి ఉంచిన రూ.25వేల నగదు, బట్టలు ఇతర వస్తువులు కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఈర్య కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న గ్రామస్తులు

గూడూరు, జూలై 13 : మండలంలోని వెంగంపేట గ్రామంలో శనివారం ఆంగోతు ఈర్య అనారోగ్యంతో మృతి చెందగా దహన సంస్కారాల కోసం కుటుంబసభ్యులకు గ్రామస్తులు రూ.7వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుందూరు శోభన్‌రెడ్డి, బొడ్డు సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ కట్ల భవానివిష్ణు, ఉపసర్పంచ్ బొమ్మగాని దుర్గయ్య, కొట్రెడ్డి రాఘవరెడ్డి, యాదగిరి, చక్రి, మంగీలాల్, సాయిలు, సంతోష్ పాల్గొన్నారు.

మరిపెడలో పీర్ల సందడి

మరిపెడ, జూలై 13 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలు వీధుల్లో యువకులు శనివారం పీర్లతో సందడి చేశారు. లయబద్ధమైన డప్పు చప్పుళ్లకు అసైదూల అంటూ యువత హోరెత్తించారు. భక్తులు దస్తీలు, కుడకలను పీర్లకు కట్టి బిందెలతో నీరు ఆరబోసి మొక్కులు చెల్లించారు.